# చేసుకున్న దారి

## చూసుకున్న మార్గమూ






నిర్మల ఆలోచించింది. ఆలోచించి ఈ నిర్ణయాని కొచ్చింది. నిర్మల రామున్ని పెళ్ళాడుతుంది.

అవును. ఎన్ని చదువులు చెప్పినా, ఆడదానికి పరమావధి పెళ్ళి. పెళ్ళితో ఆడదాని జీవితానికి పరిణతి వొస్తుంది.

వస్తుందో రాదో గాని అందరి వుద్దేశమూ అదే. అందరి వుద్దేశమూ అదే అయినట్టు మాటాడుతారు. వెనక వెనక ఎన్ని ఇబ్బందులు కొల్లించుకున్నా "ఆరోగ్యా పెళ్ళిచేసుకుని గుట్టుగా సంసారం చేసుకొనే కన్న ఏముంది" అనే అంటారు.

అవును. పెళ్ళిచేసుకుని "వొంగుడు చాటుని" వుండడమే వుత్తమమైన పని. పెళ్ళాడకూడదని ఏవో స్వల్ప కారణాలవల్ల—కేవలం వొకరిద్దరి కాపరాలు చూసి విసుగెత్తి నిర్ణయించుకోకూడదు.

లేక పోతే పెళ్ళి చేసుకుని "గుట్టుగా" సంసారంచేసుకొనే యీ కోటాను కోట్ల ప్రజలూ వెర్రివాళ్ళా, "పెళ్ళాడకూడ" దని నిర్ణయించుకున్న తను ఒక్కర్తే వీళ్ళందరి కన్నా తెలివయిందీనా!

* * *

నిర్మల రామున్ని పెళ్ళాడుతానంది.

రామం చాలా చాలా సంతోషించేడు. ఇహ తను ఆస్పత్రిచుట్టూతిరగక్కర్లే దన్నాడు. తన సంతోషం ఎలా తెలియ చెయ్యాలో తెలియడంలేదన్నాడు.

తనకీ ఆటే టైము లేదనీ, వార్డులో ఇంకా ఎటెండవలసిన పేషంట్లు చాలా మంది వున్నారనీ, సాయంకాలం తెలియజేస్తాననీ, అది—రామం సంతోషం తెలియజేసే విధానంగురించి—అతన్ని టీకి రమ్మంది.

రామం చాలా సంతోషించాడు మళ్ళీను. ఆసంతోషంలోనే నిర్మల్ని ఇంక "విధవ ఉద్యోగం" చెయ్యొద్దన్నాడు. అప్పుడే రిజిగ్నేషను ఇచ్చేసి వొచ్చేయమన్నాడు. ఇంకా వాళ్ళకీ వీళ్ళకీ ఈచాకిరీఎందుకన్నాడు. "హాయిగా" వుండకూడదాఅన్నాడు.

"అబ్బే— అంత తొందర పడతారెందుకూ? నేనస్తానన్నానా! మళ్ళీ మనసు మార్చుకోను. సాయంకాలం కలుస్తాను. ఉద్యోగం మానేస్తాను లెండి. ఇవాళ పధ్నాలుగో తారీకేగా! ఈ నెలాఖరుదాకా చేస్తాను. ఈలోగా

"వాహిని"

మా అన్నయ్యకీ అక్కయ్యకీ వుత్తరాలు రాస్తే వాళ్ళూ సంతోషిస్తారు పాపం. హౌస్సర్జనుకీ సూపరింటుకీ నామీద ఎంతో అభిమానం. వాళ్ళక్కూడా తీరుబాటుగా చెప్పాలి. నా ప్రావిడెంటుఫండు కాయితాలూ అవీ చూపించి పెళ్ళినాటికి ఆ డబ్బు వొచ్చే ఏర్పాటు చేయించుకోవాలి, ఇంకా చాలా చాలా పనున్నాయి," అంది నిర్మల.

"ఉదయం తొమ్మిదినించీ సాయంకాలం ఆరుదాకా ఎలా గడపడమూ?" అనుకుంటూ రామం ఆస్పత్రినించి వెళ్ళాడు.

నిర్మల పెళ్ళంటే హౌస్సర్జనూ ఆసుపత్రి సూపరింటెండెంటూ అనుకున్నంత సంతోషం చూపించలేదు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. నిర్మల్ని సూపరింటెండెంటు కూతురా చూసుకునే వాడని ఆస్పత్రంతా ప్రతీతి. ఆయన విశాఖపట్నంలో ఇరవై ఏళ్ళ బట్టీ వున్నాడు. నిర్మల నాలుగేళ్ళ క్రితం నర్సుగా చేరింది. అంతకు ముందెన్నడూ ఎవర్నీ ఆయన అంతగా అభిమానించడం ఆస్పత్రిలో ఎవరూ ఎరగరుట.

నిర్మల ఆయనకి చుట్టంగాదు. కనీసం స్నేహితుడి కూతురూ స్నేహితురాలి కూతురూ కాదు. అయినా సరే సత్ప్రవర్తనా, కార్యదీక్షా నిర్మల్ని ఆయనకి దగ్గరగా తీశాయి. వార్డులో నైటు డ్యూటీ అంత వుత్సాహంగాచేసే నర్సుల్ని అతను అరుదుగా చూశాడు. ఎప్పుడేనా సీరియస్ కేసులొచ్చినా, రాత్రికి రాత్రి హాజరవ వలసిన అర్జంటు కేసులొచ్చినా, నిర్మల సహాయం ఆయన అడగ్గానే వొచ్చేది గనక అడిగేవాడు. కొత్తలో నిర్మల ఆయన తన కిస్తున్న 'ట్రబుల్'కి విసుక్కున్నా ఆయన అభిమానం, ఆమూలంగా గ్రేడూ సంపాదించేసరికి నిర్మలకి ఆయన తనని అభినందిస్తున్నట్టే వుండేది గాని బాధిస్తున్నట్టు వుండేదిగాదు.

తీరుబడిగావున్న వొక రోజున ఆయన "నీకూ నాకూ ఏదో జన్మాంతర సంబంధం వుందమ్మా" అన్నాడు గూడానూ.

ఆయనకున్న అభిమానం ఆ మాటతో నిర్మలకి పూర్తిగా బోధపడింది.

"హాస్పిటల్లో పని చేసే నర్సుల్ని రోగులూ, వాళ్ళకోసం వొచ్చేవాళ్ళూ ఇష్టపడ్డంలో పెద్ద విచిత్రం ఏమీ లేదు. నర్సులు లోపల ఏమనుకున్నా కేవలం సర్వీస్కోసం పుట్టారు. విసుక్కోకుండా చాకిరీ చెయ్యడం, లాలించడం—ఇవన్నీ కొత్తవాళ్ళకి చాలాహాయిగా వుంటాయి. జీవితంలో సమభాగినులు నర్సుల్లాగ రోజూ లాలిస్తూ వుంటే మగాడు పగలల్లా ఎన్ని శ్రమలు పడా మరిచిపోగలుస్తాడు. అలాంటి అవకాశం కోసం ఎదురుచూసే మధ్యతరగతి మనస్వీకులు చాలామంది వున్నారు.

నువ్వు చెబుతున్న కుర్రాణ్ణి నేను చూడలేదనుకో కాని అతను తప్పకుండా యీ తరగతికి చెందినవాడే అయివుంటాడని చెప్ప

అను. సేవకి లాలింపుకీ ఆశ్చర్యపడి నిన్ను మెచ్చుకున్నాడు. సేవకి కొన్నాళ్ళలో మొహం మొత్తుతుంది. ఎప్పటికీ నిత్య నూతనంగా వుండేలట్టు చూసుకోవడం నీపని. సంఘంలో చదువుకున్న పిల్లలకి ఇప్పుడిప్పుడే కొ ప్రగౌరవం వొస్తోంది. పోపొందని సనాతనులింట్లో తెలుసుకొని చికాకుపడుతున్నారు కూడాను. ఈ సంగతులు గమనించుకొని సంసారం జాగ్రత్తగా దిద్దుకోవాలి" అదీ—సూపరింటెండెంటుగారు చెప్పిన దాని సారాంశం,

హావుస్సర్జను ప్రత్యేకం ఏమీ చెప్పలేదు గాని సూపరింటెండెంటు గార్లా నిరాశ పుచ్చలేదు. మనసారా ఆశీర్వదించింది. వీలయితే ఆ పుత్రాణ్ణి తనకు ఓసారి చూపించమంది.

ప్రావిడెంటు ఫండు కోయితేలూ, రాజీనామా దరఖాస్తు ఇచ్చేసి నిర్మల కొత్తయ్యకి వెళ్ళిపోయింది.

* * *

నిర్మల పెళ్ళి నిరాడంబరంగానే జరిగింది. నిర్మల తరపున వాళ్ళన్నయ్య కుటుంబంతో వొచ్చాడు. వాళ్ళక్కయ్య తను వోపలేని మనిషినంటూ మొగుణ్ణీ కొడుకుని పంపింది.

హాస్పటల్ నుంచి శెలవు దొరికిన ముగురు ఆడనర్సులూ ఇద్దరు మగనర్సులూ వొచ్చారు.

నిర్మలకి అయిదువందల అరవై రూపాయల దాకా ప్రావిడెంటుఫండు పెళ్ళి తేదీకి వారం రోజులు ముందుగా వొచ్చింది. నిర్మల పెళ్ళంటే వాళ్ళన్నయ్య ఎక్కడో రెండు వొందలు అప్పు తెచ్చాట్ట అవీ ఇవీ కలిపి పెళ్ళి అయిందనిపించారు.

వాళ్ళ నాన్నగారు సంపాదించిన పొలమూ ఇల్లు "ఇంటిఖర్చులకి" వాళ్ళన్నగారు ఎప్పుడో సొమ్ము చేసేశాడు. ఇహ అమ్మడానికే గాక వుండడానికే ఇలు లేదు. విజయనగరంలో నే వొక సత్రంలో చేశాడు పెళ్ళి.

రామమూ నిర్మలా అసలు "రిజిష్ట్రి మేరేజీ" చేసుకుందామనుకున్నారు. రామం ఎందుకలా అనుకొన్నాడంటే వాళ్ళ వాళ్లెవరూ ఇష్టపడరనుకొన్నాడు. కాని రామం వాళ్ళ నాన్నగారు భోగట్టా చెయ్యగా ఆపిల్ల—అనగాను—"కిరాస్తానీది" కాదనీ, "బ్రాహ్మలే" అనీ తెలిసింది. ఇంకా తబిశీలు ఆరాతియ్యగా ఆయనకి నిర్మల వాళ్ళ "శాఖే" అనీ, ఆయనకి సొయానా పింతల్లి భాగగారి......మనమరాలే అనీ తెలిసింది. దాంతో ఆయన కోపం పూర్తిగా హరించిపోయి "యేం ఖర్మంరా, లక్షణంగా స్వశాఖీయుల పిల్లని చేసుకుంటూనూ, రిజిష్ట్రి మేరేజీలు నిలుస్తాయిట్రా!" అన్నారు.


రిజిష్ట్రి మేరేజీకీ విడాకులకీ దగ్గర సంబంధం వుందని ఆయన వుద్దేశం.

* * *

"సేవకి మొహం మొత్తుతుంది" అన్న సూపరింటెండెంటుగారి మాటకి మొదట అర్థం బోధపడలేదు నిర్మలకి. చాలా ఓర్మికల మనిషవడంవల్ల అటువంటి వాక్యం తనకి అనుభవ పూర్వకంగా అర్థం కాకూడదనే అనుకుంది. కాని అయిదేళ్ళుగడిచి, ఇద్దరుపిల్లలు పుట్టీ, మొగుడింటో మొగుడే కాకుండా మరిదీ, మామగారూ ముఖ్యంగా ఆడపడుచూ వీళ్ళందరూ తన సేవకోసం వేచివున్నారని వొంటబట్టి—మొత్తంమీద అర్థమయ్యే అనుభవం వొచ్చేసింది. ఈ అయిదేళ్ళూ నిర్మల స్త్రీగా, ఆడదానిగా, యంత్రంగా, జీవించింది. నిర్మలకి అత్తగారు లేని లోటు లేదు. సుబ్బాయమ్మ తన ఆస్తిని తనే చూసుకోడం మొదలెట్టింది. మొగుడుపోయి నప్పటినుంచీనూ, అసలావిడ ఆస్తితో రాక పోయినా ఇంటో ఆవిడమాట చెల్లుతుంది! రామమే చాలామాట్లు అన్నాడు. ఆవిడ! పెద్దతమ్ముడు రామంమీదకన్నా చిన్నతమ్ముడు జోగినాథంమీద ఎక్కువ అభిమానం, నమ్మకమూనూ.

నువ్వేనా అయినింటిపిల్లని చేసుకొని అచ్చటా ముచ్చటా తీర్చుకోతా నాయనా! కట్నంలేని పెళ్ళి కందిపప్పులేని సంతర్పణన్నలాంటిది. ఇలా కడిగేసి పిల్లని వొప్పచెప్పి ఏళ్ళ తరబడి ఉత్తరాలేనా రాయని పెళ్ళివార్ని చూడక, అసలు నువ్వలాబుద్ధిగా చదువుకో. నేనే చూస్తాను మంచి సమంధం నీకు. మా అత్తారివేపు ఎంత లేసి కట్నాలో!" అన్నది ఆవిడ.

వొదినగారంటే జోగినాథానికి మంచిఅభి

"ఇసైవిరుంగు"—ప్రతిశుక్రవారం రేడియోసిలోన్ 41.72 మీటర్ల మీద సాయంత్రం 6-30 నుండి 6-45 వరకు విని ఆనందించండి.

# ★ చేసుకున్నదారి చూసుకున్నమార్గం ★

ప్రాయంవుందో లేదో తెలియదుగాని అతను యీ మాటలకి ఆడదాన్లా సిగ్గుపడిపోయి "పోనిద్దూ అక్కయ్యా మాటలూ నువ్వూనూ, ఎంతసేపూ పెళ్లిగోడవే నీకూ," అన్నాడు.

"ఏం, అంతసిగ్గేం? పెళ్ళాడవా యేమిటోయ్?" అని నిర్మల అన్నది.

"అద్దూ, ఆడతాడు! మా చెల్లెలెవరైనా ఆసుపత్రిలో నరసుగా పని చేస్తాందేమిటి, చూడు!" అని సుబ్బాయమ్మ విరుచుకు పడ్డాది; తమ్ముడితో తను జరుపుతున్న యింత ముఖ్యవిషయంలోకి యీ ముదనష్టం మనిషి జొరబడ్డం కష్టంతోచి—

* * *

రామం బియ్యేడీపేసయి ఉన్నవూళ్లోనే వుద్యోగం చేస్తున్నాడు. వాళ్ళ నాన్నగారు తాలూకాఫీసులో పని చేసి రిటైరవడం వల్ల ఓ యాభైరూపాయల్దాకా ఫింఛనొస్తుంది గాని, అందులో ఇంటి ఖర్చుకు వొచ్చేది ఏదో పది హేనో. రామం, నిర్మలా, ఇద్దరు మొగపిల్లలూ, సుబ్బాయమ్మ ముసిలాయనా జోగినాధం బి. యల్. చదువుతున్నాడు. ఇంటపడివుంటున్న సుబ్బాయమ్మ భూముల మీద వొచ్చేది అడపాతడపా ఇంటిఖర్చులకీ, జోగినాధం చదువుకీ అవసరమూ వొచ్చేది. ఆదుకొనేది కూడానూ.

అక్కడే వచ్చింది చిక్కంతానూ. "ఆడపిల్లసొమ్ము" తినేసి, వొంటబట్టించుకుని, రామం కొంచెం జడుపు అలవాటుచేసుకున్నాడు. కాలేజీలో చదివిన అయిదేళ్లూ రామానికి అక్కయ్యసొమ్ము తింటున్నానున్న చైతన్యంతో బాటు బోలెడంత 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు' వొచ్చింది. ఇంటిపెత్తనం మీద వేసుకుందికి తలితరవాత తల్లంత మనిషి—అంచేతే కాబోలు, జోగినాధం పరేసరి, రామమూర్తి వాళ్ల నాన్నగారూకూడా సుబ్బాయమ్మమాటకి సర్వసాధారణంగా ఎదురుచెప్పరు.

ఇంటిపెత్తనం సుబ్బాయమ్మ మీదేసుకోడంవల్లా, తనదంటూ నిర్మలకి వుండేసొమ్ము అంతా పెళ్లిలోనే అయిపోవడంవల్లా రామం నూటికి అరవైఅరుపాళ్లు అక్కయ్యకి విధేయుడవడంవల్లా, ప్రత్యేకించి ఈ ఆఖరు కారణంవలా నిర్మలకి కొన్ని ఇబ్బందులు కలిగేయి. వాటిని "కష్టాలు" అనవచ్చు. కాని అలా అనుకోకుండా గడిపేయడమే రామం ఆలోచించిన "ఇటూ అటూ భద్రం." చీటికీ మాటికీ నిర్మలని సుబ్బాయమ్మ వంశంలేని వాళ్ళనీ, దిక్కులేని వాళ్ళనీ, ఆసుపత్రి ముండనీ మొదట్లో పిలిమీదా ఎలకమీదా పెట్టేన్నీ, క్రమంగా నూటిగానున్నా అనడం సాగించింది. దీనికిసాయం నిర్మలకున్న వొక్క అన్నగారున్నూ నిర్మలచూడ్డానికి ఈ అయిదేళ్ళలోనూ రెండుసార్లుకన్నా రాకపోడమేగాకుండా, బావగార్ని చెల్లెల్ని ఒక్కసారికైనా—పోనీ ఒక్క పండుక్కైనా తమ్మని ఆహ్వానించలేదు. మొదటిపండుక్కి ఆయనకేదో ఆపదవొచ్చింది. రెండో పండుక్కి నిర్మల బిడ్డతల్లి అయింది. పిల్లలొస్తే పండుక్కిమిటి పోనిద్దూ, అని రామమే ఆపేశాడు.

"అచ్చటా ముచ్చటా తీరని సంబంధం అయిపోయిందమ్మా—చెప్పుకుంటే సిగ్గు. అతగాడు యీవిడకి అన్నగారట. పెళ్ళి చేసి మాయింట్లో పారేశాడు. ఆ పెళ్ళైనా, ఏమిటి, ఈవిడ వుద్యోగంచేసిన తాలూకు సొమ్ముతోటేసుమా!—ఒక్క పండుక్కైనా పిలవకపోతే మానె, పోనీ పురిటికైనా తీసుకెళ్లడటో!— పోనీ యీవిడ చూడామా అంటే, మరి ఆ అన్నగారిమీద ఎంత అభిమానమోగాని అయిదేళ్ళపాటాయీ ఒక్కసారి, ఒక్కసారిస్తే, అన్నగార్ని చూస్తానని గాని, అన్నగారింటికెళతానని గాని అన్నపాపాన్న పోలేదు!" అంది సుబ్బాయమ్మ, దారిబోయే దానమ్మతో; నిర్మల వుండగానే—

"ఛ్ఛ, ఏమండీ—నాకు వెడదామనే వుంటుంది. ఎక్కడికక్కడే తీరదూ! పిల్లలూ, సంసారమూ చేసుకోలేక ఇదవుతున్నాను; ఇలా వొదిలేసి వెళ్లితే ఏంసార్థకం!" అన్నది నిర్మల. తనఅక్కను ఎప్పుడూ లోపల్నించే వెళ్ళబోసుకోవాలి—

"పోనీ వంగవాచీ, ఇదిటే నువ్వుచెప్పే కబురూ? నీకుతీరుబాటు లేదూ? ఎవరేనావింటే నవ్విపోతారుస్మీ—అంత తీరుబాటు లేనిపని నువ్వేంచేసి వొలకబోస్తున్నావే? తిప్పలాడి ముస్తాబులు—నీ ముస్తాబుల్తోటే సరిపోయె; పోనీ ఆడదానివి ముస్తాబవుతే అయ్యేవు బాగానేవుంది, ఆ మొగకుంటలిద్దరికీ ముస్తాబుకీ పొగలస్తమానం చాల్దు, పోనీ రెండు పూట్లా వొండివార్చి వొరగబెడుతున్నావా అంటే వొంటలో నువ్వేయెడం చెయ్యిన్నా వెయ్యవు; చాల్చాలు, ఇలాటి కబుర్లెంకెక్కడా చెప్పబోకు;" అంది సుబ్బాయమ్మ—

నిర్మలకి పట్టలేనంత కోపంవొచ్చేసింది. మొగపిల్లలిద్దరికీ ముస్తాబుచేసుకోడమేమో నిజమేగాని వంటలో ఎడంచెయ్యయినా వెయ్యంది సుబ్బాయమ్మేగాని తను కానే కాదు. శనాదివారాలొస్తే మధ్యాన్నం మూడింటినించీ మూలపడుక్కొని "వొంట్లో అదోలావుంది కొంచెం మడిగట్టుకుని నాకొక్కస్త పుప్పుపిండికూడా చేసిద్దూ," అని వెల్లిస్తుంది. ముసలాయనకి పొద్దుట టిఫినూ, లేదా మధ్యాన్నం టిఫినూ, వారానికి మూడుసార్లు జోగినాధం స్నేహితులొస్తే వాళ్లకి టిఫిన్లూ, కాఫీలూ—["ఎలా వుండాలో తెలుసా ఒదినా, అచ్చు హోటల్లోలా వుండాలి."] ఇంటెడు చాకిరీ పని తగిలినప్పుడు చేయించుకోడానికి. తినేకి లేదనడానికీ వీళ్ళకే చెల్లింది.

"చెప్పనండీ, దారెంట పోతూ పోతూ వున్న వాళ్లని 'ఇదుగో మాటవిన్నాయ్,' అని కేకేసి 'మా యింటో యిలా ఇలా జరుగుతోంది సుమండీ' అని చెప్పుకునే అలవాటు ఇవామీదటేనా తగ్గించుకోవాలి. లేకపోతే లాభం లేదు, బొత్తిగా సంసారం రచ్చకెక్కుతోంది," అంది నిర్మల.

'దానమ్మ' గారు మనకెందుకులే అని గాబోలు వెళ్లిపోయారు.

* * *

సుబ్బాయమ్మకీ నిర్మలకీ వొచ్చిన అభిప్రాయభేదాలుగాని చిన్న చిన్న వాగ్వివాదాలుగాని నిర్మల చెప్పకుండా రామానికి తెలుస్తాయి. అతను స్కూలునించి ఇంటికొచ్చి జోడూ గుడ్డలూ విప్పుకొని వంటింటి వేపు వెళ్లేలోపుని అతనికి జరిగింది యావత్తూ ట్రిక్ ఫొటోగ్రఫీలో కనబడుతుంది. పామోషనూ, ట్రిక్ ఫొటోగ్రఫీ ఒకొక్కప్పుడు ట్రిబుల్ డైమెన్షనూ వుంటాయని తెలిసినా రామం కిక్కురుమనకుండా ఆ చిత్రణ తిలకిస్తాడు. సారాంశమే తీసుకొంటాడు.

ఎందుకంటే నిర్మల తనని పెళ్లాడుతే చాలని అతను ఆసుపత్రిచుట్టూ తిరగడం, పెళ్లాడకపోతే ఆ పక్కనేవున్న ఇంకో ఆసుపత్రి తప్ప తనకి ప్రపంచంలో స్థానం లేదని నమ్మడం అతనికి ఇంకా కొంచెం లీలగా జ్ఞాపకంవుంది.

కాని సుబ్బాయమ్మ అనే తన అక్కగారూ, ఆవిడయొక్క నైతిక ఐహిక విలువలూ అతనికి ఇంకా బాగా జ్ఞాపకం వున్నాయి. తనకు నూటిగా డబ్బు పెట్టకపోయినా తను నిర్వహించవలసిన ఈ ఇంటికి ఆవిడ ధాన్యబ్బస్తాలూ పెసలసొమ్మూ సాయమౌతున్నాయని అతను ఇంత వేగిరం మరిచిపోలేదు.

పైగా తన అక్కగారు తనకంటే పెద్ది—

ఇందువల్ల ఒకొక్కప్పుడు అక్కగారి మాటలమీద నిలచివుంచి తను ఎవరిమీదన్నా చర్య తీసుకోవలసుంటే [ఇంకెవరిమీద తీసుకుంటాడు—] అతను పైకి జంకడానికీలు లేకపోయేది.

మొదట్లో తిట్లు తిట్టేసి పడగ్గదిలో పూరడించే అలవాటుండినా, క్రమంగా పిల్లల్ని చీదరించుకోవడమూ, వేళగాని వేళప్పుడు "ఛీ! ఈ నరకంలో వుండకూడ"దని ఎటో వెళ్లిపోడమూ, తరవాత్తరవాత నిర్మల్ని కొట్టడందాకా వొచ్చింది.

ఎప్పుడైతే కొట్టడందాకా వొచ్చేసిందో నిర్మల పూర్తిగా భయమూ, నిరాశా పడిపోయింది. తనకి సాంఘికంగా ఉండవలసినంత విలువ లేదని మొదట్నించీ నిర్మల భయం. అదికాదని తనభర్త ఆసరా వున్నాడు. ఆ ఒక్క ఆసరాకూడా జారిపోతుందేమో అని నిర్మల బాధపడింది. రాత్రి మాటు మణగనిచ్చి అతనెన్ని పూరిం

వాక్యాలు చెప్పినా పైకే ఊరుకుంది గాని లోపల ఊరట కలగలేదు. ఏదో మర్మాంతికమైన వేదన ఆమెను కలత పెటింది.

"ఇంట్లో ఆఖరికి మీకూడా నామీదుంటే గౌరవం, అభిమానం పోయేయన్న మాట. సరి. అయిపోయింది పెళ్లి సరదా. మొత్తం అయిదేళ్లల్లో," అంటూ గుడ్లలో నీరు కుక్కుకుంది నిర్మల.

"ఛా వూరుకో నిర్మలా, నువ్వంతేసి మాట్లంటే నాకు కష్టంగా వుంటుంది. కొన్ని పరిస్థితుల్లో గుండె రాయి చేసుకోవాలిసొస్తుందని ముందే చెప్పానుగా!—నావల్ల పొరపాటయిందన్నాగా!—అందరూ గౌరవంగా చూడ్డంలేదంటే అది మనిష్టమా యేమిటి? మా అక్కయ్య నిన్నేమయినా అందంటే అదీ నువ్వు ఓర్పుగా భరించాలి. మా అమ్మే వుండిఅంటే ఏంచేద్దువు?—ఆవిడ్ని నేనేమీ అనలేనని తెలిసే నన్నెందుకు బాధపెడతావు. నువ్వెందుకు బాధపడతావు?" అన్నాడు రామం ఉండుండి. అతని స్వరంలో ఉద్రేకంగాని ఆవేశంగాని లేవు. కేవలం విషయం అపుచేదామని అన్నమాటలవి.

"మీరు ఏమయినా అనగలిగితే అదివన్నే అన్న సంగతి నాకు తెలుసును. మీ వుదేశం ఏమిటంటే మనం ఆవిడిసొమ్ము తింటున్నాం గనక ఆవిడ చెప్పినట్లలా నడుచుకుంటూ అన్నవలా పడాలి...ఏమయినా అనకూడని మాట నేనంటే వహ్నించరుగానీ..." అని ఆగింది నిర్మల.

"అనూ...మనిద్దర్లో మళ్లా అనుకుంటామని ఆపుకోడం ఎందుకు?"

"ఏంలేదు. మీకే అనేకసార్లు తటి వుంటుంది నూటపాతిక రూపాయలతో మొగుడూ పెళ్లాం ఇద్దరు స్వరాఖ్యా బతకడం కష్టంకాదు. ఎనభై రూపాయల గుమాస్తాలు బ్రతుకుతున్నారు. ఆవిడ సొమ్ము తినడం అంటూ లేకపోతే ఆవిడ మాటపడ్డం అన్న ప్రమేయం రాదుగా?"

"అంటే?...తతిమ్మావి ఏవీ నువ్వాలోచించవు. ఇవాళ నూటపాతికా వొస్తున్నాయి గాబట్టి వేరేవుండగలం. కాని గతం చూడక్కర్లేదా? అయిదేళ్లు దానిసొమ్ముతో నేను బి. ఏ., బియ్యీడీ కూడా చదివేను. ఇవాళ వాళ్లనివాళ్లకి వొదిలేసి మనం వెళ్ళిపోతే లోకంమాట ఎల్లావున్నా మనకే ఎబ్బెట్టుగా కనబడుతుంది. ఉన్నవూళ్లో వేరింటి కాపరం– ఇంతకీ వాళ్లు నూతృంగా చూస్తే మన సుఖానికి అడ్డు రావడం లేదనే నా నమ్మకం."

"మీరు రోజల్లా స్కూల్లో వుంటారు. మీపని మీకిద్దరికీతప్ప ఎవరికీ సంబంధించడమే లేదు. నేను ఇంటిదగ్గిరుండి పడే బాధలు మీకు తెలియక అలా అంటున్నారు. అయిదు వేళా పెట్టి పోషించేస్తున్నటూ మనం ఎల్లకాలం ఆవిడ పంచపట్టుకు వేళ్లాడిటూ సతాయిసుందావిడ" అదిగాని మీరొకసారి చూస్తే నేనన్న మాటమీరేఅంటారు."

"ఎందుకంత తొందర నిర్మలా! మా హెడ్మాస్టరూ ఇనస్పెక్టర్లూ మమ్మల్ని నే మాటలు విని నువ్వు నన్ను ఈ ద్యోగం మానేయమంటే ఎంతఅందంగా వుంటుందో ఓసారి ఆలోచించమా. నలుగురితో కలిసి బతకడం అంటే వొడిదుడుకులు ఎలాగూ వొస్తాయి. ఇంతకీ నే చెప్పిన మార్గం మంచిది. ఆవిడ ఏమన్నా నువ్వు పట్టించుకోకుండా వుంటే పోలా?"

"అలా ఎన్నిసార్లు నేనూరుకున్నానో మీకూ తెలుసు. ఆడది మాటిమాటికీ అల్లా ఒంటికాలిమీద లేవడంలో ఏమన్నా పాయింటుందా? నా వయస్సెంత, ఆవిడ వయస్సెంత—మిమ్మల్ని నాచేత ఈ వందా యాభై ప్రశ్నలూ అడిగించేకంటె, చిన్నదీ, దాన్ని సరీగా చూస్తే వాడు సుఖంగా వూపిరి పీల్చుకుంటాడని ఆవిడ అనుకోకూడదూ?"

"ఏమో. ఇలా మనమిద్దరం ఆర్గ్యూ చేసుకుని మాటకి మాటా వొప్ప చెప్పుకోవడంవల్ల వొరిగేదేం లేకపోగా అది మనల్ని క్రమంగా వేరుచేసేయవొచ్చుకూడాను. ఈ యుద్ధం ఇవాళ అంతమయ్యేదికాదు, కలకాలం వుండిపోయేదికాదు. అంచేత కొంతకాలం వోపికపట్టాలి..."

"ఓపికపట్టి, లేనిపోని సంతోషం నటిస్తూ మీతోకూడా జరిగింది చెప్పుకోకూడదు. ఓనాడు ఆ మరచిరోజూ వస్తుంది. అప్పటికి ఆత్మ పూర్తిగా చచ్చిపోయి శరీరం మిగులుతుంది. సుఖంగా వుండొచ్చు. హుం!"

(మిగతా వచ్చేవారం)



# చేసుకున్న దారి

# చూసుకున్న మార్గమూ

(గతవారం తరువాయి)

జోగినాథానికి పెళ్ళివారొచ్చారు. పిల్ల మేనమామా తండ్రీ వొచ్చిచూసి వెళ్ళారు.

ఈ పెళ్ళి జోగినాథం కల్పించుకున్నదే. విజయనగరం కాలేజీకి సైన్సు ఎగ్జిబిషనుకి వెళ్ళినప్పుడు జియాలజీ హాల్లో రకరకాల చేపల్ని చూపించిన అమ్మాయే పెళ్ళికూతురు. డిమాన్‌స్ట్రేషన్—యస్. శ్యామల—ఫస్టు ఇయర్. అన్న చిన్నసైజు బోర్డు చూసి ఆ అమ్మాయినే యస్ అంటే ఏమిటో కనుక్కున్నాడు. ఫరవాలేదు. పిల్ల కలివిడిగానే మాట్లాడింది. ఆవిడ చెప్పిన ఇంటిపేరూ అతనికి నచ్చింది.

ఈ ఎస్. శ్యామల్ని అతని ఫ్రెండు రవీంద్రం ఎరుగును. రవీంద్రం క్లాసుమేటు నారాయణరావు చెల్లెలట, ఈ శ్యామల.

రవీంద్రాన్ని నారాయణరావుకి ఉత్తరం రాయమన్నాడు జోగినాథం. వ్యవహారం కొంతవరకూ నడిచింది. శ్యామల తాలూకు వాళ్లు పిల్ల చదువుకుంటోందనీ, చదువు పూర్తయితేగాని పెళ్ళాడనంటున్నదనీ రాశారు. తనకి చదువవలేదనీ, పెళ్లి చదువుకి అభ్యంతరం లేకుండానే జరుగుతుందనీ జోగినాథం రాయించాడు.

మామూలుగా పెళ్ళి చూపులూ అవీ సంప్రదాయబద్ధంగా పెద్దవాళ్ళ అనుమతితో జరగాలనీ, చదువుకుంటున్న ఈ కాలపుపిల్ల గాబట్టి అమ్మాయి ఇష్టపడడమూ ముఖ్యమేననీ, కట్నం ప్రసక్తి లేదనీన్నీ వారు రాశారు. సరే, సరే సరే అని రాయించాడు జోగినాథం.

అప్పుడు పిల్లతరఫువాళ్లు రావడం, పుర్రాణ్ణి, మిగతా విషయాల్నీ చూసుకోడమూ జరిగాయి.

పిల్లని చూడానికి జోగినాథాన్నీ, నిర్మల్నీ రామాన్నీ వాళ్ళనాన్నగార్నీ రమ్మన్నారు.

"నాన్నా వాళ్లూ వెళితే చాలదూ, నే చూశాగా!" అన్నాడు జోగినాథం. డియ్యాలో ఇన్స్పెక్షను ఉందని రామం నిర్మల్ని పంపిస్తానుగాని నేను రాలేనన్నాడు.

పెళ్లి చూపుల్నుంచి వచ్చేక ఇంట్లో అడుగుపెడుతూనే తిన్నగా వొంటింట్లో సుబ్బాయమ్మ దగ్గిరకి వెళిపోయాడు జోగినాథం. "ఏంట్రోయ్ విశేషాలు?" అని రామం కేకేస్తున్నా వినిపించుకోలేదు.

ముసలాయన మొహం చిట్లించుకుని "అడుగు! నీ పెళ్ళాన్నే అడుగు నాయనా!" అంటూ పెరట్లోకి వెళ్ళాడు.

రామం నిర్మలకేసి తిరిగాడు. నిర్మల మొహంలో కత్తి వేటుకి నెత్తురుచుక్క లేదు. తనకేసి చూడ్డంలేదు. తిన్నగా గదిలోకెళ్ళిపోయి తలుపులు వేసుకొంది. మంచం మీద బోర్లాపడి వెక్కి వెక్కి ఏడుస్తోందని గమనించాడు రామం. రెండు నిమిషాలు అలాగే తోచక నిలబడిపోయాడు.

ఆగలేక జోగినాథం సుబ్బాయమ్మ వున్న చోటికి వెళ్ళాడు.

రామాన్ని చూడగానే వాళ్లు మాట్లాడుతున్నవాళ్ళు అలాగే ఆగిపోయి అతనికేసి చూడ్డం మొదలెట్టారు.

"ఏం? ఏం కొంపమునిగిందీ" అని గర్జించాడు రామం.

తమ్ముడు అంత గట్టిగా ఏదీ అడిగిన జ్ఞాపకం లేదు సుబ్బాయమ్మకి, అలా అతను తెగించేసరికి ఆవిడ హృదయం బద్దలైనంతపనైంది. వెంటనే ఏడుపు లంకించుకుంది.

## "వా హి ని"

"ఛీ!" అని రామం విసుగ్గా వెనక్కి వెళ్లాడు రామం.

మళ్లీ నిర్మలవున్న గదిదగ్గరకొచ్చి తలుపు తట్టాడు. తియ్యలేదు. కిటికీలోంచి చూశాడు. ఇంకా నిర్మల ఏడుస్తోంది.

రామానికి ఏంతోచలేదు. అక్కడే కుర్చీలో కూచున్నాడు. తండ్రి వచ్చాడు.

"విన్నావా?" అన్నాడు తీక్షణంగా.

"లేదు. ఎవరూ చెప్పందే!" అన్నాడు రామం అంతకంటే తీక్షణంగా. "చెప్పడానికి ఏముంది?—నీ భార్య నిర్మల హాస్పటల్లో నర్సుగా చేరకముందు ఎవడితోటో వుందిట. ఒక కడుపుకూడా అయి తీయించుకుందిట."

చెబుతూ వుండగానే సుబ్బాయమ్మ తూల్తూ ఏడుస్తూ వొచ్చి "అయ్యో ఇహ వాడికి పెళ్ళేలా అవుతుందిరా! ఈ దిక్కుమాల్ని సమంధం వొద్దురో అంటే నా మాట విన్నావుగావురా! అయ్యో ఇహ నేనెలా బతకనురా, దాని చేతో వణ్ణం కూడా తిన్నాన్రా!" అని ఏడుపుసాగించింది.

"నలుగురిలోనూ అవమానం అయిపోయిందిరా. ఏదో సామ్యం చెప్పినట్టు లాయరు విశ్వనాథంగార్ని కూడా తీసుకెళ్లాం. ఆయనా చిన్నబుచ్చుకున్నాడు పాపం. మా పిల్లని మీ యింట్లో ఇవ్వంగాక ఇవ్వం అని మొరాయించారు వాళ్లు. వాళ్ళింట్లో ఆడవాళ్ళక్క దగ్గిరా, మొగవాళ్ళక్క దగ్గిరా చేరి ఒకటే గుసగుసలూ. ఛా! తలకొట్టేసినట్టయిపోతేను!" అన్నాడు జోగినాథం.

రామం రెండు నిమిషాలు ఆలోచించాడు.

"ఎవరు చెప్పారు మీకీ భోగట్టాలన్నీనూ?" అన్నాడు ఉండుండి.

"అతగాడు మరెవరో కాదు. మేం చూడ్డానికి వెళ్ళిన పిల్ల తాలూకు అన్నగారే! అతడే చెప్పాడూ!" అన్నాడు ముసలాయన.

"హయ్యోరాత! ఎవరు చెబితే ఏమిట్రా వెర్రినాయనా, చిలకపిట్టలా అన్ని సవాళ్ళకీ నేను నేనని వొప్పుకుందిటేవిడ!..." అంది సుబ్బాయమ్మ ధూకుడుగా.

ముసలాయన అందుకున్నాడు. "—చూడూ, జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇప్పుడివీ అన్నీ తెలిశాక అలాంటిదాన్తో కాపరంచెయ్యడం తెలివితక్కువా, అప్రదిష్ట ముచ్చటాను. అంచేత, నేనొకటి చెప్తావిను. తనకేసకరు మంచిదిగాదని తనకి తెలుసుగదా, తెలిసి మనకి చెప్పకుండా మోసం చేసిందిగా!..."

"డైవోర్సుకి దరఖాస్తు చెయ్యన్నయ్యా!" అన్నాడు జోగినాథం,

రామం బిక్కమొహంతో ముసలాయనకేసి చూశాడు.

"ఇంకా చూస్తావేంటన్నయ్యా నేనైతేనా, ఇంతదూరం రానిచ్చేవాణ్నే కాదు హుం" అంటున్నాడు జోగినాథం.

"హయ్యోరాత! వాడి కెవరు నచ్చజెప్ప గల్రా నాయనా. వాడు దానివల్లోపడి గిలగిలా కొట్టుకుంటున్నాడు. ఇది ఇలా ఎంతమందినో! ఆ దిక్కుమాలిన ఆసుపత్రి నిండా వొచ్చే మొగాడూ పోయే మొగాడూనూ...హయ్యో నాకేం ఖర్మం వొచ్చి పడ్డాదిరా, దీనిచేతికూడు తిని భ్రష్టురాల్నైపోయాన్రో—" అని మళ్ళీ ఏడుపు సాగించింది సుబ్బాయమ్మ.

"ష్! నువ్వు ఏడుపు మానుదూ, తల్లీ!" అని కసురుకున్నాడు తండ్రి. "జాగ్రత్తగా ఆలోచించు రామం. నువ్వేం భయపడక్కరేదు. తనసంగతి మనకి పూర్తిగా చెప్పనట్టూ, మోసం చేసినట్టూ—"

రామం చటాలున అందుకున్నాడు. "మోసం ఏం లేదు నాన్నగారూ. మోసం ఏమీ లేదు. నిర్మల పెళ్ళికిముందే నాతో అన్నీ చెప్పింది," అన్నాడు.

"చెప్పిందీ! — అయితే నీదేనన్నమాట యీ ప్రయోజకత్వం. ఏరికోరి దీన్నలా చేసుకున్నావ్? నీకు చిన్నప్పణ్ణించీ చదు

చెప్పించినా నా ఇదిఅయితేనూ,"అంటోంది సుబ్బాయమ్మ—

"అబ్బ! నువ్వూరుకోవే, వెధవగోల— అయితే చెప్పిందంటావా, — అప్పుడు నీ వివేకం ఏమయిందినాయనా?—మాతో చెప్పావు కాదేం?"

"మీతో చెప్పేఅయ్యేది అప్పుడూ ఏం లేదు, ఇప్పుడూ ఏం లేదు. అయినా అదంత విచారించవలసిన విషయం గాదు, జ్ఞానం వొచ్చిందో లేదో అప్పటికా అమ్మాయికి— స్కూలు ఏనివర్సిరోజున ఫంక్షనుకివెళ్ళి మధ్యలో తలనొప్పని వొచ్చేసుంటం ఎవరూ లేని సమయంచూసి మోసే చేశా డెవడో వెధవ. అందులో నిర్మల తప్పేమిటో నాకెంత ఆలోచించినా బోధపడ లేదు. తెలిసీ తెలియని పిల్ల - బలవంతం మోసం జరిగింది. కడుపైతే తీయించుకోక వాడెంటబడి తిరుగుతారా ఏమిటి? వాణ్ని అడిగితే నేను గాదని దేశాలంట పోయాట్ట. దేశాలంట పోకుండా వున్నట్టయితే వాడి సంగతి ఏం తేలేదో—ఆ మహానుభావు డిప్పుడు తన వీరగాథ చెప్పకుండికి వ్రాడి వడాళ్ళావుంది—చెప్పండి నాన్నగారూ, ఇందులో నిర్మల తప్పేముందోనూ, నేను నిర్మల్ని పెళ్ళిచేసుకుంటానని అడిగినప్పుడే తను ఫలానా, అని పూర్తిగా నాకు చెప్పింది. ఆలోచించి నాకు న్యాయమని తోచే పెళ్ళాడేను...'

ముసలాయన అస్పష్టంగా ఏదో గొణుగుతున్నాడు—

"ఆలోచించి చూస్తే అందరికీ ఏవో తప్పులు ఉంటూనే వుంటాయి. ఇంతవరకూ వొచ్చేక అనకుండా నేనెందు కూరుకోవాలీ, వెంకాయమ్మగారి శశి వెర్రిబాగుల్ది గాబట్టి గర్భంలో శిశువుందనైనా ఆలోచించక నూతిలోపడాది. జీవించడానికి హక్కుందని గుర్తించో, ఏనాటికైనా ఆ వెధవకి చెప్పు దెబ్బకొడదామని ఉద్దేశించో నిర్మల నూతిలోనూ గోతిలోనూ పడలేదు. అదే నిర్మలచేసిన తప్పు. ఏం! జోగినాథమూ నారాయణరావూ ఒక్కలాంటి పెద్దమనుషులే-తగుదునమ్మ అని పెళ్ళికోసం పరుగెత్తిన పెద్దమనిషికి తగిన పెద్దమనిషే బుద్ధిచెప్పాడు. ఛీ ఛీ—" రామం ఆవేశంతో అని అక్కణ్ణుంచి వెళ్ళాడు.

* * *

అయిదునిమిషాలో రామం పెరట్లోంచి వొచ్చాడు. మాట్లాడకుండా కుర్చీలో కూచున్నాడు. తండ్రీ అక్కగారూ ఒకళ్ళ మొహా లొకళ్ళు చూసుకుంటున్నారు. జోగనాథం నేలనే చతికిలబడి తలవాల్చుకున్నాడు. అతని వుషారంతా మాయమైంది.

ఎవరూ మాట్లాడడం లేదు. సుబ్బాయమ్మ ఏడుపు ఏమయిపోయిందా అని రామం వెతుకుతున్నాడు.

అతని చూపులకి తట్టుకోలేక సుబ్బాయమ్మ "భోజనాలకి లేవండి నాన్నగారూ! ఎప్పుడు తిన్నారో! లేరా తమ్ముడూ, జోగూ!" అని చరున వెళ్ళిపోయింది.

జోగినాథానికి ఆకలి వెయ్యకపోయినా అక్కగారు సూచించిన మార్గంలో నడుద్దామని కాబోలు, అవిడవెనకాలే వెళ్ళాడు.

మళ్ళీ నిశ్శబ్దం రెండు నిమిషాలు గడిచాయి.

ఉండుండి ముసలాయన "అయితే-నువ్వన్నది నిజమే నంటావురా-ఏమిటి, వెంకాయమ్మ కూతుర్ని మన జోగ-కి?" అని అడిగాడు.

రామానికి మళ్ళీ కోపం తిరగబెట్టింది. "అవును ఎవరికీ ఏమీ తెలీదు. మీకూ తెలీదు అక్కయ్యకీ తెలీదు. శవపంచాయతీ జరిపించడానికీ దహనపర్చడానికీ మీరు వుండాయా ధైర్యపాయలూ ఊరికే పరోపకారార్థం చేశారు. పాపం! ఇహ అక్కయ్యంటారా, ఆపిల్లపోయిన వారం పదిరోజుల్దాకా ఊరికే పొరుగావిడగదా అని ఊరటబెట్టి ఇంతఅన్నం పెట్టింది-అంతే ఎటొచ్చీ నేనే మీకందరికీ కష్టం కలిగించాలని ఏవో అవాకులూ చెవాకులూ వాగుతున్నాను... ఎందుకొచ్చిన కబుర్లు నాన్నగారూ, భోజనానికి లేవండి."

ముసలాయన ఇహ లేచాడు. "నువ్వో" అంటూ కదిలాడు.

"నాదయింది. వెళ్ళండి...పాపం దాని మనస్సెంత కష్టపడుతోందో ఒక్కసారి చూడాలి," అంటూ గది తలుపుదగ్గిరకి నడిచాడు రామం.

తలుపు తెరుచుకుని మూర్తీభవించిన శోకదేవతలా నిర్మల నిలబడ్డది.

నిర్మల కష్టాల్లోపుటి కష్టాల్లో పెరిగింది. తండ్రిపోయిన పిల్లని ఎనిమిదేళ్ళ దాన్ని కొడుకప్పజెప్పి తల్లిపోయింది. అన్నగారు తీరుబాటుగా చదువుకోనీ, పెళ్ళాడీ, వుద్యోగం చేస్తూ నిర్మలకి చేసిన వుపకారం ఇదీ అని చెప్పడానికి ఎవరికీ జ్ఞాపకం లేదు. స్కూల్ ఫైనల్ దాకా చదువు చెప్పించి, ఏదీ పెళ్ళిచేదామని ఇంకా సమంధాలు వెతుకుతూ వుంటేనే అఘాయిత్యం జరిగింది. అంతకష్టం వొసేనే ఛావుముండా, అని గదిలో పెట్టి వొళ్ళు హూనం చేశాడు గాని ఆవెధవని పట్టుకొని ఇంతగడ్డి పెడదామని ప్రయత్నించలేదు. చిన్న చిన్న లోటుపాట్లు-అందరూ తినేసిన తరవాత తనకి అన్నం చాలకపోతేనూ, సరీగా కాసం పెట్టినట్టు-తన బట్టలకీ తన గాజులకీ, తన పెళ్ళికి డబ్బు మిగలకపోతేనూ, పూటపూటా భోజనాలయిపోయేసరికి వొదినగారిపిల్ల లేడుస్తే వొంటెల్లుతనే చక్కబెట్టుకోవలి సొస్తేనూ, ఎంతో గుట్టుగా సవరించుకుని బాటన్నిటినీ పిండివొంటల్లా దిగమింగింది. ఎప్పుడూ ఇంతగా ఏడవలేదు.


ఈరోజు వీళ్ళమాటలకి నిర్మల జన్మకంతటికీ సరిపోయే ఏడుపు ఏడ్చింది. తెచ్చుకు తెచ్చుకు జ్ఞాపకాలు తెచ్చుకు ఏడ్చింది. అయిదేళ్లు కష్టాలన్నీ మర్చిపోయి నిత్యానందంగా గడిపి కావాలని తనే ఆలోచించుకుని అనుకూలుడైన భర్త దొరికాడు గదా అనుకుంటే పూర్వపు సన్నివేశాలు తనని వెంటాడి పగ సాధించుకుంటున్నాయి, అనుకుని అనుకుని ఏడ్చింది.

మొహం పొంగి, వొళ్ళు అలిసి, ప్రయాణపు బడలికా, దుఃఖ వికారమూ అవిణ్ని వికృతంగా చేశాయి.

రామానికి దుఃఖం పొంగి పొర్లివచ్చింది. కాని అతను ఈ సన్నివేశానికి కొంచెము తయారులోనే వుండడంవల్ల కొంతలో కొంత నిలద్రొక్కుకున్నాడు.

మాట్లాడకుండా గదిలోకి తీసుకెళ్ళి, మంచముమీద కూచోబెట్టి 'ఇవాళే మొదలనుకుంటూ నువ్వు యేడవడం,' అన్నాడు.

నిర్మల తలొంచుకునే వుంది. అనుకోకుండా నిట్టూర్చింది.

# ★ చేసుకున్న దారి – చూసుకున్న మార్గమూ ★

"ఇవాళే అఘరుకూడానూ. ఇకా నిన్ను యూడవనివ్వను. ఛా, ఏదీ నావేపు చూడూ ...నవ్వాలి. నవ్వలేవనుకో—అయినా నా చేత అట్టే మాట్లాడించకుండా వుండాలంటే నవ్వు—...దీంట్లో ఏంతేముందీ, మనం ఎప్పుడో ఇలా జరుగుతుందని అనుకున్నాంగా!" అని రామం నవ్వాడు కావాలని.

ఏడుపుని సడన్ బ్రేకు వేసి ఆపగలమా! వీలో, మెకానిజానికి మానుకోడం! ఏడవడానికి అంతే స్వేచ్ఛ లేదు గనక!

అతికష్టంమీద నిర్మల మాట్లాడింది. "నాల్రోజులపాటు తల దాచుకుందామంటే పుట్టిల్లయినా లేదు. ఎంత పాపం చేసుకు పుట్టానో!" ఏడుపు తగ్గలేదు.

"విచారించకని చెప్పానా!—నీకేం భయం లేదు. నాకెవరూ నిన్నింకేం అనరు... అన్నంటే నేను కాసుకుంటాను. నాల్రోజులపాటు నేను స్కూలు కెళ్లినంతసేపూ గదిలోంచి ఇవతలికి రాకుండా కూర్చో. ఇంట్లో ఎవరూ లేరనుకో. అనవెవ్వరూ నీతో మాటాడ్రు. మూడోంతుల ముప్పాతిక ఇక మీదట మా అక్క నిన్ను వొంటపొయ్యి దగ్గిరికి రానియ్యదు. రానియ్యకపోతే మరీ మంచిది. నీ అంతట నువ్వు కలగజేసుకోకు. వృథాగా ఆలోచిస్తూ కూచోక, నాలుగు రోజులు కంప్లీటు రెస్టు తీసుకో. పిల్లలూ నువ్వూ గదిలోనే గడిపెయ్యండి—ఏం భయంలేదు" అన్నాడు రామం.

నిర్మల మాటాడలేదు. పిల్లలవేపు చూసింది. పెదవాడు గుర్రమెక్కి వూగుతూ వాడిలో వాడు పాడుకుంటున్నాడు. చిన్నవాడు వుయ్యాల మంచంలో పడుకున్నాడు. పెద్దవాణ్ణి తీసుకెళ్ళి అన్నం పెట్టాలి.

* * *

పదిరోజులు కూడా కాలేదు. ఒకనాడు నిర్మల సాయంకాలం నాలుగింటికి వీధిలోకెళ్ళి తిరిగి ఏడింటికి వొచ్చింది. చిన్నకుర్రాణ్ణి కూడా తీసుకుపోయింది. వెళ్ళేటప్పుడు పెద్దకుర్రాడు ఏడవడు గదా అని ఇంటిదగ్గిరే వుంచేసింది.

ఇంట్లో అడుగు పెడుతూనే చిన్నకొడుకుని పడుకోబెడదామని గదిలోకెళ్ళింది నిర్మల. పెద్దవాడూ పడుకున్నాడు. వొళ్ళు కాలిపోతూ వుంది వాడికి.

సావిట్లో మామగారు చుట్ట కాలుస్తూ మంచంమీద కూచున్నారు. మరిది ఓమూల టేబిల్ దగిర కుర్చీలో కూచుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. ఓ 'గోడవార కొంగేసుకు' పడుకుంది సుబ్బాయమ్మ కునికిపాటు పడుతూ.

ద్వారందగ్గిర ఒక అరనిమిషం నిశ్శబ్దంగా నిలబడి చివరికి "బాబిగాడికి ఎన్ని గంటలకొచ్చిందొదినా, జ్వరం?" అని అడిగింది నిర్మల.

"ఏమో నమ్మా, ఎవరికని పెట్టుక్కూచున్నారు! నేనేమో నీ ధర్మమా అని వొంటపొయ్యిదగ్గర మాడుతుపోతే గాని వీల్లేదాయిరి. నువ్వేమో బీచీలకీ క్లబ్బులకీ ఇంకా ఎక్కడెక్కడికో తిరిగి అపరాత్రి వేళ వొస్తావు..."

ఒక్క మాటలో ఆవిడ తన అక్కసంతా వెళ్ళబోసుకుందని నిర్మల అనుకుంది. నీ ధర్మమా అని వంటపొయ్యి, ఎక్కడెక్కడికో—ఈ మాటలు మునపటికన్నా మాటిగానే తగిలేయి మరి. ఏమయినా తను మాటాడదల్చుకోలేదన్న సంగతి జ్ఞాపకం వొచ్చింది. ఆయన చెప్పినట్టు రెండు చేతులూ చరుస్తేగాని చప్పుడు కావుగా!

కాని సుబ్బాయమ్మకి నిర్మల మాటాడకపోవడం వురట్టుకున్నట్టుగా వుంది. ఇంకా ఏవి, ప్రారంభించిందంటే, ఆవిడ కొసంటా చెప్పడానికి నిర్మల ఆస్కారం ఇవ్వందే!

"వేళకు వెధవున్నాడో లేడో, వాడికి పొగరు. మడిగట్టుకున్నాను ముట్టుకోకురా అంటే మీదమీదకొచ్చిపడ్డాడు. ఏమయినా అందామంటే అంతా నానోట్లో గడ్డి పెడతారు."

"ఇవాళ ముట్టుకున్నాడా, ఎప్పుడూ!"

"ఎప్పుడయితే నేం, సాయంత్రం! మళ్ళీ స్నానంచేసి తగలడ్డాను. బొత్తిగా మాకూడు తినలేము గద!"

"మాలకూడే నుండి వదినగారూ! మొన్నటిదాకా నేనొండితే తిన్నారు గదండీ. నేనెప్పుడన్నా మడిగట్టుకుండాను గనుకనా? ఇవాళ ఏదో తెలియక చిన్న వెధవ ముట్టుకున్నాడని దానికి మీ గోత్రాలన్నీ పోయినట్టు ఇంత రభసెందుకండీ—?" అంది నిర్మల.

మాట్లాడకుండా వుండామనుకోడం, ఉండలేకపోడం, అదో బలహీనత. నిర్మల సంసారంలోపడి తెచ్చుకున్న బలహీనతలో ఇదొకటి—

"నీతో నాకెందుకమ్మా రభసా? ఎవరో ఇలా పడి వుండాలి మరి. ఇంతకీ నిన్నని లాభమేమిటి—మన బంగారం మంచిదయితే అనీ—వాడికుండాలి ఆ జ్ఞానం. చిటికెలాటివి రాసిపెట్టాడు భగవంతుడూ!"

ఈ పోటుకు మాటలు మింగలేకండానే రామమూ వొచ్చాడు. వొస్తూనే సుబ్బాయమ్మ మాటలు విన్నాడు.

"నిర్మలా, నిన్ను గదివొదలి రావొద్దంటే విన్నావా? ఎందుకిలా క్షోభ కొని తెచ్చుకుంటావూ?" అని పెరట్లోకి వెళ్లిపోయాడు.

నిర్మల గదిలోకి వెళ్లింది.

కాళ్లూ చేతులూ కడుక్కొచ్చి రామం ఖాళీగావున్న ఈజీ చైర్లో కూచుని తుడుచుకుంటున్నాడు.

"అయితే అక్కా! మడిగట్టుకుంటే ముట్టుకున్నాడని పాలుగల్లి వెధవనీ అలా బాదకొడతావా! నిర్మలమీద కోపం నామీదకోపం మేం ఇంట్లో లేకుండా మా చంటివెధవ మీదా తీర్చుకోడం?—ఛీ, నీ దయాదాక్షిణ్యం లేకపోతే కానీ సిగ్గన్నా లేకపోయిందీ, పసి వెధవని కొట్టడానికి?" అని గట్టిగానే అడిగాడు.

"నేనేం భావా కొట్టలేదు, చితకాకొట్ట లేదు. చికాకుపడి ఒక్కటి ఇలా అన్నానో లేదో వాడు కంయిమన్నాడు. వాళ్లదా మించి సీతమ్మ చూసింది, దాన్నే అడు




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన జర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు ఈ పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

కావలిసి. వాణ్ణి అంతకంటే ఏమన్నా అన్నానో, తెల్లవారే సరికి నన్ను నాకా అమ్మే ఎత్తుకుపోతుంది."

"ఏమో, వొస్తూంటే దార్లో నిలబెట్టి సీతమ్మా, ధర్మారావూ చెప్పారు. ఆవిడ 'ఏమిటమ్మాయ్, పసివెధవని కొడుతున్నా' వని కేకేస్తే నువ్వు ఆగి అటు చూశావుట. ధర్మారావుగారు ధర్మామీటరు తెచ్చి జ్వరం వొస్తే చూశారుట కూడానూ. కొడితే కొటనూవచ్చు. దానికి నే కాదన్ను. కొడితే దెబ్బ వుండిపోదు; వొస్తే జ్వరమూ ఉండిపోదూ. మాట మాత్రం వుండిపోతుంది. అసలింకా వాడికి మడీ తడీ అర్థమై ఆకారణంమీద వాణ్ణి నువ్వూ నేనూ కొట్టె వయస్సు రాలేదని నీకు తెలీదుటే అక్కయ్యా?"

తన చేతులో పెంచిన తమ్ముడు తనకి నీతి బోధ చెయ్యడం సుబ్బాయమ్మకి చికాగ్గానే వుంది.

"అయితే కిట్టని వెధవలు చెప్పిన మాటలు విని నన్నంతలేసి మాట్లంటావ్రుటా? అను అను ఇంకా అను. అన్నివిధాలా చెడ్డాను."

తండ్రి కలగజేసుకొని "లేచి భోజనాలు చెయ్యండర్రా. వెధవ గొడవ ఎప్పుడూ ఏదో వొకటి!" అంటూ జోగినాధం దగ్గరున్న లైటు తీసుకుని వొంటింటివేపు నడిచాడు.

తండ్రి వెనకాలే జోగినాధమూ, సుబ్బాయమ్మా వెళ్ళారు.

రామం గదిలోకి వెళ్లాడు.

"అబ్బా! జ్వరం బాగానే వొచ్చినట్టుందే!" అన్నాడు.

"ఆఁ దాందేముందిలెండి. భయం మీా వొచ్చింది. తెల్లారేప్పటికి అదే పోతుంది" అంది నిర్మల తాపీగా. ఆ స్వరం చూస్తే నిర్మల వ్యంగ్యంగా అంటూందేమోనని అతను ఊరుకున్నాడు.

నిర్మల ఇంకా తాపీగా "యేమండీ-" అంది.

"ఆఁ"

"చూచాండి. ఇవాళ మీతో చెప్పకుండా వొపని చేశాను."

"ఏమిటది?"

మీరేమీ అననంటే నే చెప్తాను."

"ఏమంటా నేను?"

"ఏమేనా అంటారేమో అన్న భయం లేదనుకోండీ—అయినా,—"

"ఏమీ అనను లే చెప్పు."

"నేను మళ్ళీ వుద్యోగంలో చేరుతానని మాటిచ్చి వొచ్చాను."

"ఏం వుద్యోగం?"

"అదే—హాస్పటల్లో—నాలుగు రోజుల కిందటే అప్లికేషను పెట్టాను. సూపరింటెండెంటుగారున్నారు గదా అని. ఇవాళ రమ్మని కబురొచ్చింది. వెళ్ళాను. కాలీ లున్నాయన్నారు. రేపు, లేదా ఎల్లుండి, మిమ్మల్ని అడిగి జాయినవుతానని చెప్పాను. మీరేదో డిక్లరేషను ఇవ్వాలిట, అభ్యంతరం లేదని, ఫారాలు తెచ్చాను. సంతకాలు పెట్టరూ?"

రామం ఇలా జరుగుతుందని ఎప్పుడో ఛాయామాత్రంగా ఊహించాడు. అయినా ఆశ్చర్యపడ్డాడు.

"వెనకోసారి పెద్దవాడు పుట్టాక ముందు కెళ్ళినప్పుడాయనే అడిగారు.

ఏమమ్మా యీ డబ్బు సరిపోతోందా అని. నేను సరిపోతుందన్నాను. చాలనప్పుడు చెసేవోపికుంటే, దొరికే వుద్యోగముండీ అన కాశం జారవిడుచుకోవద్దూ, నేను ఎప్పుడు బడితే అప్పుడు సాయం చేస్తారన్నా రాయన. చేశాగు కూడానూ."

"కానీ—" అన్నాడు రామం.

'కానీ ఏం లేదు. సున్నపు వీధిలో మంచి ఇల్లొకటి మాట్లాడి వొచ్చాను. మీకు హైస్కూలుకు చాలా దగ్గిర. పాతిక రూపాయలద్దె. పోనివ్వండి. మనకి రెండు వందల పదొస్తాయి, మాట ఎనబై చాలవా ఏం? పిల్లలవిషయం మీకేం బెంగ లేదు, నేనె లాగో చూసుకుంటాను. మరేం ఫరవాలేదు. అన్నీ సద్దుకోగలం. ఎప్పటికేనా మన కాళ్ల మీద మనం నిలబడకపోతే మీ అక్కయ్య ఆ స్తికోసం బతుకు తామటండీ, వెర్రిగాని! మీరు మనసారా వొప్పుకుంటారనే అన్ని యేర్పాటూ చేశాను. మీరు వొక్కసారి గా తండ్రితోడూ విడిచి రావడం కష్టమే అనుకోండి గాని, ఒక్కసారి రాగలరు. అటుపైని మీ ఇష్టమూ, నా అదృష్టమున్నూ!

"బాగానే వుంది. నువ్వంతా బందోబస్తు చేశావన్న మాట."

"సరే అనండీ—మీరు సరే అంటే రేపే ప్రయాణం."

"సరే—"

★

(అయిపోయింది)

